ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 11 మార్చి 2025

ఇంటర్ పరీక్షలకు 352 మంది గైర్హాజరు

గుజరాతీపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 352 మంది గైర్హాజరయ్యారు. సోమవారం గణితం-2బీ, జువాలజీ-2, హిస్టరీ పరీక్షలు నిర్వహించారు. ఇందులో జనరల్ విభాగంలో 16,426 మందికి 16,104 మంది హాజరు కాగా 322మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా ఒకేషనల్‌కు సంబంధించి 1,097 మందికి 1,067 మంది హాజరు కాగా 30మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 17,523 మందికి 17,171 మంది హాజరైనట్లు అధికారులు పేర్కొన్నారు.





రిమ్స్ ఆస్పత్రిలో మార్చురీ గది

మార్చురీలో పైసా చికత్వం!

- పోస్టుమార్టం నిర్వహణకు డబ్బులు డిమాండ్
- వైద్యుడికి రూ.2వేలు, గుమస్తాకు రూ.500..
- మంత్రి అచ్చెన్న చెప్పినా.. మారని తీరు

ఆ ఆసుపత్రిలో ప్రతీ సేవకూ.. ఓ సెప'రేటు' ఉంది. శరీరానికి గాయమైనా, కాలు విరిగినా, సదరం సర్టిఫికెట్ పొందాలన్నా అక్కడి వైద్యులు, సిబ్బంది అడిగినంత ఇచ్చుకోవాల్సిందే. పేషెంట్‌ను ఐసీయూ నుంచి వార్డుకు మార్చాలన్నా.. ప్రసవమైన తర్వాత ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయినా.., వారికి మామూళ్లు ఇవ్వాల్సిందే. చివరకు ఎవరైనా ప్రమాదవశాత్తు చనిపోతే.. ఆ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాలన్నా.. డబ్బులు చెల్లించాల్సిందే. ఇదీ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో జరుగుతున్న వైద్యుల కలెక్షన్ల బాగోతం. మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించినా.. వైద్యుల 'పైసా' చికత్వం తీరు మారడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

శ్రీకాకుళం క్రైం, మార్చి 10(ఆంధ్రజ్యోతి):

జిల్లాకే పెద్దాసుపత్రిగా పేరొందిన జీజీహెచ్ (రిమ్స్)లో కొంతమంది వైద్యుల తీరు చర్చనీయాంశమవుతోంది. కష్టాల్లో ఉన్న బాధితులకు సేవలందించకుండా.. కలెక్షన్లపైనే దృష్టి పెడుతూ.. 'పైసా'చికంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో ఎక్కడ ప్రమాదం సంభవించినా క్షతగాత్రులను శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తుంటారు. ఒకవేళ రోడ్డు ప్రమాదాలు, గొడవల్లో మృతిచెందినా, ఆత్మహత్య చేసుకున్నా, ఎటువంటి అనుమానాస్పదమైన మరణం సంభవించినా.. మృతదేహాలకు రిమ్స్‌లోని మార్చురీలో పోస్టుమార్టం నిర్వహిస్తుంటారు. మార్చురీలో ఒక డాక్టర్, అసిస్టెంట్ డాక్టర్, మేల్ నర్సింగ్ సిబ్బంది, స్వీపర్‌తో పోస్టుమార్టం చేస్తారు. ఈ పోస్టుమార్టం ద్వారా వచ్చిన నివేదికను రిమ్స్ కళాశాలలో ఉన్న ఫోరెన్సిక్ కార్యాలయంలో వారం నుంచి 15రోజులులోగా అందిస్తారు. దీని ఆధారంగానే సహజ మరణమా.? లేక ఆత్మహత్యా?.. లేదా ఎవరైనా చంపేశారా? అన్నది తెలుస్తోంది. తద్వారా పోలీసుల కేసులు కూడా కొలిక్కి వస్తాయి. కాగా ఉచితంగా చేయాల్సిన పోస్టుమార్టం ప్రక్రియకు ఇక్కడి వైద్యులు ఒక రేటు నిర్ణయించారు. పోస్టుమార్టం నిర్వహణకు కావాల్సిన కిట్టును మృతుడి కుటుంబ సభ్యులే తెచ్చుకోవాలని కొత్త నిబంధన విధించారు. ఈ కిట్టు మార్కెట్‌లో రూ.200 నుంచి రూ.400 ఉంటుంది. రిమ్స్‌లో వైద్యులు, సిబ్బంది తమ చేతివాటం ప్రదర్శించి.. ఆస్పత్రి ఔట్‌గేటు వద్ద దుకాణాల్లో ఈ కిట్టును రూ.1150 నుంచి రూ.1300కు విక్రయిస్తున్నారు. ఇందులో పోస్టుమార్టం సిబ్బందికి కమీషన్ వెళ్తుందనే ఆరోపణలున్నాయి. ఆత్మహత్య చేసుకున్న మృతదేహానికి సంబంధించిన కిట్టుకు ఒక రేటు, ప్రమాదాల్లో (మిగతా 6వ పేజీలో..)

- శ్రీకాకుళం నగరానికి చెందిన ఓ దళిత కుటుంబ పెద్ద ఇటీవల మరణించాడు. అతడి మృతదేహానికి రిమ్స్ మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం ఖర్చుల పేరుతో డాక్టర్‌కు రూ.2వేలు, గుమస్తాకి రూ.500 చెల్లించాలంటూ అక్కడి వైద్య సిబ్బంది డిమాండ్ చేశారు. బాధితులు నిరుపేదలని పోలీసులు చెప్పినా.. వారు మాత్రం వసూళ్ల పర్వం ఆపలేదు.

- గతేడాది నవంబరులో చిలకపాలెం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి కాలు విరిగిపోగా.. చికిత్స నిమిత్తం రిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆ యువకుడు మృతిచెందాడు. కాగా.. పోస్టుమార్టం నిర్వహించిన ఓ వైద్యుడు తమ చేతివాటం చూపించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటువంటి ఘటనలు రిమ్స్ మార్చురీలో తరచూ జరుగుతూనే ఉన్నాయని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు.

పినాకపాణి..
స్వరాల వాణి
- వైద్యునిగా... సంగీత విద్వాంసునిగా విశేష ప్రతిభ
- నేడు వర్ధంతి

6లో

'జల్‌జీవన్'పై
నీలినీడలు
- నత్తనడకన పనులు
- దాహార్తితో అవస్థలు

8లో

ఆర్థిక ఇబ్బందులతో
స్మగ్లర్లుగా..
- ముగ్గురు ఒడిశా వాసుల అరెస్టు
- ఏడు కిలోల గంజాయి స్వాధీనం: డీఎస్పీ


మానవత్వం మరిచి..

ఆమె నిండు గర్భిణి. వారంలో ప్రసవిస్తుంది. భర్తతో బైక్ మీద వెళ్తోంది. పుట్టబోయే బిడ్డపై వారికి ఎన్నో ఆశలు.. కలలు. ఓ ఆర్టీసీ డ్రైవరు వారి కలలను ఛిద్రం చేశాడు. రెండు ప్రాణాలను బలిగొన్నాడు. ఢీకొట్టిందే కాక.. బస్సును ఆపకుండా ముందుకు పోనిచ్చాడు. దీంతో గర్భిణి కాలుపై వెనుక టైరు వెళ్లింది. తీవ్ర రక్తస్రావంతో ఆమె విలవిల్లాడింది. పక్కన పడిపోయిన భర్త.. సాయం కోసం అటుగా వెళ్తున్న వాహనాలు ఆపే యత్నం చేశాడు. ఎవరూ స్పందించలేదు. అయితే ఓ ఆటోడ్రైవర్ ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. మరో వారంలో బాహ్య ప్రపంచం చూడాల్సిన గర్భస్థ శిశువు కూడా చనిపోయింది.

- నిండు గర్భిణిని ఢీకొట్టి.. ఆపకుండానే వెళ్లి..
- వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- కాలు మీద టైరు వెళ్లడంతో తీవ్ర రక్తస్రావం
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తల్లి, శిశువు మృతి
- సీసీ ఫుటేజీతో బస్సును గుర్తించిన పోలీసులు
- డ్రైవరుకు మద్దతుగా స్టేషన్‌కు ఆర్టీసీ సిబ్బంది
- పోలీసులు, బాధిత కుటుంబీకులు సీరియస్

రాజేశ్వరి (ఫైల్)





ప్రమాదానికి కారణమైన బస్సు ఇదే

శ్రీకాకుళం క్రైం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని డేఅండ్‌నైట్ జంక్షన్ సమీపంలో ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీ కొని ఓ గర్భిణీ మృతి చెందింది. ఎచ్చెర్ల మండలం కుంచాలకురమయ్యపేట చెందిన వెంపాడ దుర్గారావుకు అదే గ్రామానికి చెందిన రాజేశ్వరితో కొన్నేళ్ల కిందట వివాహమైంది. దుర్గారావు టిఫిన్ అమ్ముతూ, ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ దంపతులకు ఏడాది పాప ఉంది. ప్రస్తుతం రాజేశ్వరి మళ్లీ తొమ్మిది నెలల గర్భిణి. ఆరోగ్య పరీక్షల్లో భాగంగా సోమవారం ఉదయం 9.30 గంటలకు దుర్గారావు తన స్కూటీపై భార్య రాజేశ్వరిని రిమ్స్‌కు తీసుకెళ్లాడు. మరోవారం (మిగతా 6వ పేజీలో..)

పరిశ్రమల స్థాపనతోనే ప్రగతి

- సింగిల్ విండో ద్వారా సత్వర అనుమతులు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనతోనే ఆర్థిక ప్రగతి సాధ్యపడుతుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సోమవారం ఆయన జూమ్ విధానంలో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. సింగిల్ డెస్క్ విధానం కింద కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తుల పురోగతిపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'పారిశ్రామిక ప్రగతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని అనుమతులను సత్వరమే మంజూరు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలి. ఏపీఐఐసీ భూముల కేటాయింపులు, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి రెండు నుండి ఐదు ఎకరాల వరకు భూసేకరణ చేపట్టాల'ని ఆదేశించారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పనా కార్యక్రమం కింద చేపట్టిన పనుల ప్రగతిని అంచనా వేసి, పీఎం విశ్వకర్మ పథకం అమలుపై సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా ఈ పథకానికి 11952 దరఖాస్తులు రాగా, 8173 మంది అర్హత సాధించారని, వారిలో 5884 మందికి శిక్షణ పూర్తయిందని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 917 మందికి రుణ సదుపాయం కల్పించామని, మిగిలిన అర్హులకు కూడా త్వరగా రుణాలు అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎంసీఎంఈ సర్వే తాజా నివేదికను పరిశీలించి, నూతన పారిశ్రామిక విధానం 4.0 మార్గదర్శకాలపై చర్చించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం కె.విజయరత్నం, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాంబాబు, ఎల్‌డీఎం సూర్యకిరణ్, సుడా అధికారి కృష్ణ, గ్రౌండ్ వాటర్ డీడీ రమణమూర్తి, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రాణీమోహన్ పాల్గొన్నారు.

ఆ పనులు ఎవరు చేశారు?

- ఐటీడీఏ పరిధిలో రహదారుల నిర్మాణంపై కలెక్టర్ ఆరా!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మెళియాపుట్టి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధి లో చేపడుతున్న రహదారి పనులపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆరా తీసినట్టు సమాచారం. ఐటీడీఏ పరిధిలోని ఓ ఇంజనీరింగ్ అధికారి కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తూ.. నాణ్యతలోపంతో పనులు చేపట్టి.. బిల్లులు పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనిపై ఈ నెల 8న 'ఆంధ్రజ్యోతి'లో 'ఆ అధికారే కాంట్రాక్టర్' శీర్షికన ప్రచురితమైన కథనంపై కలెక్టర్ స్పందించారు. ఈ పనులు ఎవరు చేపడుతున్నారు.. నాణ్యత తదితర అంశాలపై ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం రహదారుల నిర్మాణానికి ఉపాధిహామీ నిధులు మంజూరు చేసింది. హిరమండలం పరిధిలో ఐదు పనులకు రూ.8.45కోట్లు, మెళియాపుట్టి మండలంలో 39 పనులకు రూ.20.79 కోట్లు, పలాస, టెక్కలిలో రెండేసి పనులకు రూ.80లక్షలు చొప్పున, మందసలో 25 పనులకు రూ.100 కోట్లు ఐటీడీఏ ద్వారా మంజూరు చేసింది. సీతంపేట పరిధిలో సుమారు 73 పనులకు రూ.4,084.00 కోట్లు నిధులు విడుదల చేసినట్లు ఇంజనీరింగ్ అధికారులు లెక్కలు చూపారు. అయితే అధికంగా బినామీ పేర్లతో ఇంజనీరింగ్ అధికారులు పనులు చేయించడం చర్చనీయాంశమైంది. కలెక్టర్‌తోపాటు ఈఎన్‌సీ శ్రీనివాసరావు ఈ పనులపై క్వాలిటీ కంట్రోల్ అధికారుల నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నట్టు తెలిసింది. అధికారులు ఎవరైనా బినామీల పేరిట పనులు చేస్తున్నారా? లేదా? ఆరా తీసినట్టు సమాచారం. దీంతో ఆ అధికారి తమ తప్పును కప్పి పుచ్చుకునేందుకు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో చేసిన 33 పనులపై విజిలెన్స్ అధికారులు విచారణ చేస్తున్నారు. కాగా.. అక్రమార్కులపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.



కుమ్మిచెట్టు - మామిడిగుడ్డి రోడ్డు ఇలా..



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వేతనం పెంపుపై సీఎం ప్రకటన చేయాలి

- కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల నిరసన

8లో

కొండ గ్రామాలకు నీరేదీ?

- మరమ్మతులకు గురైన రక్షితనీటి పథకాలు
- పాడైపోయిన పైపులైన్లు
- గిరిజనులకు తప్పని ఇబ్బందులు



- మెళియాపుట్టి మండలం కొండపై ఉన్న అడ్డివాడ గిరిజన గ్రామంలో సుమారు 37 కుటుంబాలు ఉన్నాయి. 150 మంది ప్రజలు నివసిస్తున్నారు. 15 ఏళ్ల కిందట ఒక స్వచ్ఛంద సంస్థ ఈ గ్రామానికి గ్రావీటి ద్వారా ట్యాంక్ ఏర్పాటు చేసింది. పైపుల ద్వారా ట్యాంకుకు వస్తున్న ఊటనీటిని గిరిజనులు వినియోగిస్తున్నారు. కొండపై నుంచి నాలుగు కిలోమీటర్ల పొడవునా వేసిన పైపులు పాడవడంతో నీరు తక్కువగా వస్తోందని ఆందోళన చెందుతున్నారు. ఈ పథకానికి సోలార్ ఏర్పాటు చేసినా పనిచేయడం లేదని, రోజూ నీటికోసం ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.



- మెళియాపుట్టి మండలం చందనగిరిలో సుమారు 60 కుటుంబాల్లో 200 మంది జనాభా నివసిస్తున్నారు. ఇక్కడ కూడా గ్రావిటీ ద్వారా నీరందిస్తున్నారు. ఊటబావి నుంచి వచ్చే పైపులైన్లు పాడవడంతో నీరు రావడం లేదు. ఇటీవల రోడ్డు పనులు చేపట్టినప్పుడు పైపు తవ్వడంతో బురదనీరే వస్తోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



- మెళియాపుట్టి మండలం గూడ గ్రామంలో 23 ఇళ్లు ఉన్నాయి. 97 మంది ప్రజలు నివసిస్తున్నారు. గ్రామానికి గ్రావిటీ నీరు సైతం లేదు. దీంతో కొండ కింద రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బావినీరే దిక్కవుతోంది. గతంలో బావిలో మోటారు ఏర్పాటు చేసి.. గ్రామంలో ట్యాంక్‌కు తాగునీరు సరఫరా చేసేవారు. ప్రస్తుతం మోటారు పాడవడంతో నీరు తమ గ్రామానికి రావడం లేదని గిరిజనులు పేర్కొంటున్నారు.

మెళియాపుట్టి, మార్చి 10(ఆంధ్రజ్యోతి):

కొండపై గిరిజన గ్రామాలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 672 గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఇందులో 93,877 మంది నివసిస్తున్నారు. 234 రక్షితనీటి పథకాలు, 1,497 పంపుసెట్లు, 888 బావులు ఉన్నాయి. వీటితో పాటు 115 గ్రావిటీలు ఉన్నాయి. విద్యుత్ సౌకర్యం లేని గ్రామాలకు 210 సోలార్ పథకాలను ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లు తాగునీటి పథకాల నిర్వహణ కోసం నిధులు మంజూరు చేయలేదు. దీంతో చాలా తాగునీటి పథకాలు మరమ్మతులకు గురయ్యాయి. పలుచోట్ల పైపులు పాడైపోయాయి. 2022లో మాజీ సీఎం జగన్ పాతపట్నంలో పర్యటించారు. ఉద్దానం తాగునీటి పథకంతోపాటు ఇంటింటికీ తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. పాతపట్నం నియోజకవర్గానికి రూ.265కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఎన్నికల ముందు పైపులు తెచ్చారు. కానీ పనులు చేపట్టకపోవడంతో తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లేక..

ప్రస్తుతం వేసవి సమీపించింది. కాగా రెగ్యులర్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి లేరు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెళియాపుట్టి ఏఈ కల్యాణ్‌ను విశాఖ జిల్లాకు బదిలీ చేశారు. పాతపట్నం ఏఈ ఉదయ్‌కు మెళియాపుట్టి ఇన్‌చార్జి ఏఈగా బాధ్యతలు అప్పగించారు. ఆయన ఇటీవల అంగన్‌వాడీ కేంద్రాలకు సైతం తాగునీరు ఇవ్వాలనే ఉద్దేశంతో ట్యాంకులు ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. కాగా పనులు చేసినా బిల్లులు ఇవ్వడం లేదని పలువురు పేర్కొంటున్నారు. రెండు మండలాలలకు ఒక్కరే ఏఈ కావడంతో తాగునీటి సమస్య పరిష్కారం కావడం లేదని చెబుతున్నారు.

ఇబ్బందులు రానివ్వం

వేసవిలో ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే తాగునీటి సమస్యలు ఉన్న గ్రామాలను గుర్తించాం. అయాచోట్ల పనులు చేపడతాం.

-ప్రసాద్‌పండా, ఎంపీడీవో, మెళియాపుట్టి



కళ్యాణం.. ఇప్పుడు వైభోగం

- కనిపించని పచ్చని పందిళ్లు
- భారీ స్థాయిలో షామియానాలు
- కనుమరుగవుతున్న సంప్రదాయాలు



● ఇటీవల పాతపట్నం నియోజకవర్గానికి చెందిన ఒక నాయకుడి కూమారుడికి వివాహమైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎవరూ చేయని విధంగా పెళ్లి పందిరికి సెట్లు వేసి.. ఘనంగా వివాహం చేశారు. దీనికి సుమారు రూ.4 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు తెలిసింది. ఈ వేడుకలో ఎక్కడా అలనాటి పచ్చటి పందిళ్లు కనిపించలేదు. పెద్ద పెద్ద షామియానాలు, కృత్రిమ పందిళ్లు వేశారు.

● ఇటీవల శ్రీకాకుళంలో ఒక నాయకుడి కూమార్తె వివాహం ఓ కల్యాణ మండపంలో చేశారు. ఒక్కో భోజనం ప్లేట్‌కు రూ.700 వరకు ఖర్చు చేసినట్లు తెలిసింది. కానీ ఎక్కడా పచ్చని పందిరి కనిపించలేదు. ఇది కూడా షామియానాల నీడలోనే నడిచింది.

మెళియాపుట్టి, మార్చి 10(ఆంధ్రజ్యోతి):

పట్టణాల్లోని కల్యాణ మండపాల్లో పెళ్లిళ్లకు పందిళ్లు కనిపించలేదంటే ఫర్వాలేదు. వివాహాలు చేయడానికి స్థలం ఉండకపోవడంతో ఎక్కువగా కల్యాణ మండపాలకే ప్రాధాన్యమిస్తారు. కానీ ప్రస్తుతం గ్రామాల్లో కూడా పెళ్లిళ్ల ఇళ్ల ముందు జరగడం లేదు. మండల కేంద్రంతో పాటు సమీప గ్రామాల్లో అందుబాటులో ఉన్న కల్యాణ మండపాలకే ప్రాధాన్యమిస్తున్నారు. దగ్గరి బంధువులు కూడా వివాహ సమయానికి వచ్చి... అక్షింతలు వేసి.. ఫొటోలకు ఫోజులిచ్చి.. భోజనాలు చేసి.. తిరుగుముఖం పట్టే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇటీవల నిశ్చితార్థాలకు కూడా కల్యాణ మండపాలే వేదికలవుతున్నాయి. కల్యాణ మండపంలో వివాహం జరిగినా ఇంటి ముందు పెళ్లి పందిరి వేయడం ఆనవాయితీ. కానీ కొంతకాలంగా దీనికి కూడా కొందరు స్వస్తి చెబుతున్నారు. పందిళ్లకు బదులు అధికశాతం షామియానాలు వచ్చేస్తున్నాయి.



భోజన ఏర్పాట్లకు ఇలా...

అంతా ఈవెంట్స్ బృందానికే...

ప్రస్తుతం 'ఈవెంట్స్' ట్రెండ్ నడుస్తోంది. ఓ మాదిరి పట్టణాలు...పల్లెలకూ 'ఈవెంట్స్' బృందాల సేవలు విస్తరిస్తున్నాయి. దీంతో వధూవరుల తల్లిదండ్రులు అన్ని పనులూ వారికే అప్పగిస్తున్నారు. సమయానికి పెళ్లి కుమార్తె, పెళ్లి కుమారుడు వస్తే చాలు.. అన్నట్టు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల జిల్లాలోని ఓ వివాహ వేడుకలో పేరంటాళ్లను తీసుకొచ్చే బాధ్యతను సైతం ఈవెంట్స్ వారికే అప్పగించారంటే..మన వివాహాల తీరు ఎలా మారుతుందో అర్థం చేసుకోవచ్చు.

సారెకు బదులు నగదు..

జిల్లాలోని వివాహాల్లో సారెది ప్రత్యేక స్థానం. వివాహానికి పది రోజుల ముందు నుంచే మహిళలు పెళ్లి వారి ఇళ్లకు వెళ్లి... సారెకు సంబంధించిన వివిధ పనుల్లో పాలు పంచుకునే వారు. పెళ్లి కుమార్తె తరఫున పుట్టింటి వారు సారె సమర్పించాక... దీనికి సంబంధించిన వివిధ వస్తువులను కలిపి... పసుపు, కుంకుమలను పల్లెల్లో ఇంటింటికీ పంచి పెట్టేవారు. ఇటీవల ఈ పద్ధతిలోనూ మార్పు వచ్చింది. సారెకు బదులుగా వరుడి కుటుంబ సభ్యులకు నగదు ఇచ్చే సంస్కృతి పెరుగుతోంది. దీంతో ఇరుగు పొరుగు వారికి సారె సామగ్రి పంచి పెట్టే సంప్రదాయమూ కనుమరుగవుతోంది. దీని వల్ల బంధుత్వాలను కాపాడుకోవడంపై కొంత ప్రభావం పడుతోంది.

వాట్సాప్‌లోనే ఆహ్వానం..

గతంలో వివాహమంటే పెద్ద తంతు. పెళ్లి చూపులు.. నిశ్చితార్థం... ముహూర్తాల నిర్ణయం... వివాహ వేడుక.. అన్నిటికీ కలిపి కనీసం ఐదారు నెలల సమయం పట్టేది. బంధువులను ఆహ్వానించ డానికే నెల రోజులకు పైగా సమయం తీసుకునే వారు. ఇటీవల కాలంలో వధూవరుల ఉద్యోగాలు... ఇతర వ్యవహారాల కారణంగా సంబంధాలు కుదిరిన నెల రోజుల్లోపే ముహూర్తాలు పెట్టుకుంటున్న సంఘటనలూ ఉంటున్నాయి. దీంతో ఆహ్వానాలకూ సోషల్ మీడియా, ఫోన్లపై ఆధార పడాల్సి వస్తోంది. ఆహ్వాన పత్రికలను వాట్సాప్‌లో పెట్టడమో... ఫోన్ల ద్వారా కబురు చేయడమో చేస్తున్నారు.



గత ఏడాది గొప్పిలిలోని ఓ పెళ్లి ఇంటి ముందు వేసిన తాటాకు పందిరి

ఆనాటి సందడి కనిపించటం లేదు..



మా చిన్నతనంలో ఊరిలో వివాహం జరిగితే వారం రోజుల ముందు నుంచే సందడికని పించేది. ప్రస్తుతం పెళ్లి రోజు కూడా సందడి కనిపించని పరిస్థితి. ఇంటి ముందు పెళ్లిళ్ల చేయించడానికి చాలామంది ముందుకు రావడం లేదు. పూర్వపు పద్ధతులను పాటించకపోవడం బాధ కలిగిస్తోంది.

-సరస్వతి, పెద్దజగన్నాథపురం, మెళియాపుట్టి

పందిళ్ల జాడే లేదు..



మా చిన్నాతనంలో వివాహం జరిగితే వీధంతా పచ్చని పందిళ్ల వేసేవారు. కొబ్బరి కమ్మలు, తాటాకులు తీసుకువచ్చి ఊరంతా పందిళ్ల వేసేవారు. అవి ప్రస్తుతం ఎక్కడా కనిపించడం లేదు. సంప్రదాయాలు కనుమరుగవుతుండడం ఇబ్బందిగా అనిపిస్తోంది.

-చిన్నబాబు, మెళియాపుట్టి

పచ్చని పందిళ్లలో చేస్తే మంచిది..



వివాహాలు పచ్చని పందిళ్లలో చేస్తేనే మంచిది. ప్రస్తుతం ఈవెంట్స్ సంస్కృతి వల్ల సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయి. పెళ్లి ఇళ్లలో పచ్చని పందిళ్ల వేస్తే కాపురాలు కూడా పచ్చగా కళకళలాడుతూ ఉంటాయి.

-వనమాలి వెంకట రమణమూర్తి శర్మ, రాజరాజేశ్వరి పీఠం, చాపర



విరగకాసిన పనస

నర్సింగపల్లి పంచాయతీ కొల్లివలస గ్రామంలో ఓ రైతుకు చెందిన పనస చెట్టు విరగకాసింది. ఒక్క చెట్టు మొదలు చెట్టూ 40కు పైగా కాయలు కాయడం విశేషం. ఏటా ఇదే తరహాలో చెట్టు మొదలులో పనస కాయలు కాస్తున్నాయని రైతు భవానీదేవి తెలిపారు. డిసెంబరు, జనవరి నెలల్లో పనస చెట్టుకు నీరు పెట్టడం ద్వారా ఈ కాపు వస్తుందన్నారు.

-టెక్కలి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి)

పినాకపాణి.. స్వరాల వాణి

- వైద్యునిగా... సంగీత విద్వాంసునిగా విశేష ప్రతిభ
- నేడు వర్ధంతి

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి):

వృత్తిపరంగా ఎంతోమందికి శారీరకపరమైన ఆరోగ్య సమస్యలను పరిష్కరించిన ఆ 'డాక్టర్... ప్రవృత్తిపరంగా తన సంగీత కళాప్రతిభతో ఎందరికో మానసిక ఆరోగ్యాన్ని ప్రసాదించారు. ఆయనే 'పద్మభూషణ్' డాక్టర్ శ్రీపాద పినాకపాణి. వైద్యుడిగా ఆ విభాగంలో ప్రతిభ కనబరచడమే కాకుండా సంగీతంలోనూ అంత ర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. పోలాకి మండలం ప్రియాగ్రహారంలో శ్రీపాద కామేశ్వరరావు, జోగమ్మ దంపతులకు 1913 ఆగస్టు 3న పినాకపాణి జన్మించారు.

'ద్వారం' శిష్యుడిగా...

పినాకపాణి ప్రియాగ్రహారంలో ప్రాథమిక విద్య, విజయనగరంలో ప్రాథమికోన్నత విద్యనభ్యసించారు. 1939లో ఆంధ్రా మెడికల్ (విశాఖ) కళాశాలలో




గణపతి సచ్చిదానంద స్వామితో పినాకపాణి (ఫైల్)

ఎంబీబీఎస్, 1945లో జనరల్ మెడిసన్‌లో ఎండీ పూర్తి చేశారు. కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా, సూపరింటెండెంట్‌గా పనిచేసి 1968లో ఉద్యోగ విరమణ చేశారు. అనంతర కాలంలో ఆ జిల్లాలోనే స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. రాజమండ్రికి చెందిన లక్ష్మణరావు వద్ద తొలి సంగీత పాఠాలు నేరుకున్న పినాకపాణి.. ఆ తరువాత వయొలిన్ విద్వాంసులు ద్వారం వెంకటస్వామి వద్ద శిష్యరికం చేశారు. ఆయన సేవలకు గుర్తుగా 1984లో భారత ప్రభుత్వం 'పద్మభూషణ్' బిరుదుతో సత్కరించింది. 99వ జన్మదినం నాడు 'జ్ఞానవిద్యా వారధి' బిరుదుతో టీటీడీ సత్కరించింది. శ్రీపాద తనకు లభించిన స్వర్ణ పతకాలను కరిగించి భద్రాచలం సీతమ్మకు వడ్డాణం చేయించి సమర్పించారు. పాణినీయం, ప్రవృత్తి, స్వర రామమ్, అభ్యాసమ్, నా సంగీత యాత్ర' అనే రచనలు ఆయన కలం నుంచి జాలువారాయి. శ్వాసకోస వ్యాధితో బాధపడుతూ 2013 మార్చి 11న తుది శ్వాస విడిచారు.

సబ్ సెంటర్‌కు పాణి పేరు..

సంగీతం, వైద్య రంగంలో ఆయన చేసిన సేవలను గుర్తించిన ప్రభుత్వం ప్రియాగ్రహారం ఉప ఆరోగ్య కేంద్రానికి పినాకపాణి పేరు పెట్టి గౌరవించింది. ఈ భవన నిర్మాణానికి స్వాతంత్ర్య సమర యోధుడు గరిమెళ్ల సత్యనారాయణ బంధువులు స్థలాన్ని ఇవ్వడం విశేషం.



పినాకపాణి (ఫైల్)

మార్చురీలో 'పైసా'చికత్వం!

(ఐదో పేజీ తరువాయి)

మరణించిన వారికి మరో రేటు.. ఇలా బాధితుల కష్టాన్ని బట్టి డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే పోస్టుమార్టం చేసే డాక్టర్‌కి రూ.2వేలు, గుమస్తాకు రూ.500 సెపరేటుగా చెల్లించుకోవాల్సిందే. లేదంటే పోస్టుమార్టం నివేదిక మరిచిపోవాల్సిందే. ఆ నివేదిక కోసం బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు రిమ్స్ కళాశాలలో ఉన్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫోరెన్సిక్ కార్యాలయానికి చెప్పులు అరిగిపోయేలా తిరగాల్సిందే. పోస్టుమార్టం నివేదిక కోసం పోలీసులు వెళ్తే.. డాక్టర్‌కు ఫీజు ఇవ్వలేదని, తక్షణమే చెల్లించాలంటూ ఫోరెన్సిక్ కార్యాలయంలో పని చేసే గుమస్తాలు నిర్భయంగా చెబుతుండడం విస్మయానికి గురిచేస్తోంది. మృతుల కుటుంబాలకు అండగా నిలవాల్సిన పోలీసులు.. ప్రేక్షకపాత్ర వహించాల్సిన దుస్థితి నెలకొంది.

● **మంత్రి అచ్చెన్న మందలించినా..**

కోటబొమ్మాళి మండలం నిమ్మాడకు చెందిన ఓ వ్యక్తి కొన్ని నెలల కిందట రిమ్స్‌లో మృతి చెందాడు. ఆ మరుసటి రోజు పోస్టుమార్టం చేయాల్సి ఉండగా.. ఓ వైద్యుడు రూ.2వేలు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని మృతుడి కుటుంబ సభ్యులు మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి అచ్చెన్న ఫోన్‌లో మాట్లాడి.. తక్షణమే ఆ మృతదేహానికి పోస్టుమార్టం చేయాలని ఆదేశించారు. అయినా ఆ వైద్యుడు రూ.1,500 వసూలు చేశారు. తర్వాత రిమ్స్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ.. 'శవాలు మీద చిల్లర ఏరుకోవడానికి సిగ్గుగా లేదా?' అంటూ వైద్యులను మందలించారు. ఇంకోసారి ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినప్పటికీ కొంతమంది వైద్యులు, సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతూనే ఉన్నారు. ఇంత జరుగుతున్నా రిమ్స్ కళా శాల ప్రిన్సిపాల్ రవి వెంకటాచలం మాత్రం తమకేమీ పట్టనట్లే వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి రిమ్స్‌లో కలెక్షన్ల భాగోతానికి అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

● **చర్యలు తీసుకుంటాం..**

ఇటువంటి ఘటనలు జరుగుతున్నట్టు మా దృష్టికి రాలేదు. ఇప్పటికే విచారణ చేపట్టాం. నిజంగా వసూళ్ళకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. పోస్టుమార్టం నిర్వహణకు ఎటువంటి కిట్లు కొనాల్సిన అవసరం లేదు. బాధితులు నేరుగా నాకు ఫిర్యాదు చేయొచ్చు.

-డాక్టర్ షకీల, సూపరింటెండెంట్, జీజీహెచ్

శాసనసభలో మనవాణి

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి


● **శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్**



అరసవల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 'బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమ'ని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. అసెంబ్లీ సమా వేశంలో సోమవారం వివిధ అంశాలపై ఆయన మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలు అండగా నిలిచారని గుర్తు చేశారు. బీసీలకు రాజకీయ గుర్తింపును తీసుకువచ్చిన ఏకైక పార్టీ తెలుగుదేశం అని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 650 మంది బీసీ నేతలపై తప్పుడు కేసులు బనా యించారని, 2,540 మందిపై దాడులకు పాల్ప డ్డారని తెలిపారు. బీసీ, ఎస్సీ, మైనారిటీ సం ఘాలను కులాల పేరుతో కార్పొరేషన్లుగా విడదీసి వారికి విధులు, నిధులు లేని చైర్మన్లుగా చేశారని విమర్శించారు. బీసీ కార్పొరేషన్‌ను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. పలాస నుంచి దుర్గి వరకు రైలు సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారని అన్నారు. అలాగే అక్కడి వారికి తెలుగు వారిగా కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయంలో ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లాల విభజనపై స్పష్టత ఇవ్వండి..

● **ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్**



ఆమదాలవలస, మార్చి 10 (ఆంధ్ర జ్యోతి): 'రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో చేపట్టిన జిల్లాల విభజనపై ప్రభుత్వం పరిపూర్ణ స్పష్టతఇవ్వా ల'ని ఎమ్మెల్యే కూన రవికుమార్ సోమవారం శాసనసభలో కోరారు. శ్రీకాకుళం జిల్లాలో ఉన్న రాజాంను విజయనగరం జిల్లాలో, పాలకొండను మన్యం జిల్లాలో చేర్చడం వల్ల విద్యార్థులు స్థానికేతర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంద న్నారు. స్థానిక సంస్థలు, జిల్లా పరిషత్, కోర్టు వ్యవహారాలు ఇప్పటికీ ఉమ్మడి జిల్లా అంటూ కొనసాగించడం వల్ల ప్రజలు తికమకపడుతూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన సభ దృష్టికి తెచ్చారు. బూర్జ మండలంలో 56 ఎకరాల దేవాలయ భూములు ఉంటే... రికార్డులు మన్యం జిల్లా అధికారుల పర్యవేక్షణలో ఉండడం విడ్డూరంగా ఉందన్నారు. అప్పటి సీఎం జగన్‌రెడ్డి 26 జిల్లాలని ప్రకటించి... విభజించడమే తప్ప నేటికీ పూర్తి స్థాయి అధికారులు, కార్యాలయాలు లేవని అన్నారు. నాలుగేళ్ల నుంచి అద్దె కూడా చెల్లించకుండా ప్రైవేటు భవనాల్లో కార్యాలయాలు నడుస్తున్నాయని రవికుమార్ తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత శాఖ మంత్రి స్పందించి... జిల్లాల విభజనపై పరిపూర్ణ స్పష్టత వచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలని.. ప్రజలకు ఇబ్బందులు తప్పించాలని కోరారు.

వ్యవసాయ ఆధారిత ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి..

● **ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు**



రణస్థలం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో 60 శాతం మంది వ్యవసాయం రంగంపై ఆధారపడి ఉన్నారు. వ్యవసాయ ఆధారిత ప్రోసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాల'ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం జరిగిన శాసనసభ సమావేశంలో ఆయన మాట్లాడారు. వరి, మొక్క జొన్న, ఇతర ఉద్యానవన పంటలకు గిట్టుబాటు ధర లభించినప్పుడే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలో 28వేల మత్స్యకార కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. వేటాడి తెచ్చిన చేపలను నిల్వ చేసేందుకు సరైన కోల్డ్‌స్టోరేజ్‌లు లేకపోవడం వల్ల మత్స్యకారులు నష్టపోతున్నారని అన్నారు. చేపలకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారని అన్నారు. అంతే కాకుండా పూర్తి స్థాయిలో చేపల వేట లేకపోవడంతో బతుకు తెరువు కోసం సుదూర ప్రాంతాలకు వలస వెళుతున్న చాలా మంది మత్స్యకారులు వివిధ ప్రమాదాల్లో మృతి చెందుతున్నారని అన్నారు. మత్స్యకారుల వలసల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. అదేవిధంగా పాడి రైతులను ఆదుకోవాలన్నారు.

బీసీలను గుర్తించింది ఎన్టీఆర్..

● **నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**



నరసన్నపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 'ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో బీసీలను గుర్తించింది అన్న ఎన్టీఆర్' అని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం అసెంబ్లీలో బీసీ సంక్షేమంపై ప్రసంగించారు. విద్యాపరంగా వెనుకబడి ఉన్న బీసీల కోసం నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జిల్లాకొక బీసీ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయించారన్నారు. అలాగే నేటి సీఎం చంద్రబాబు నాయుడు బీసీల సంక్షేమం కోసం 2014లో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ కళాశాలలు, పాఠశాలలను ఏర్పాటు చేశారని కొనియాడారు. జనాభాలో అధిక భాగం ఉన్న బీసీలకు రాజ్యాధికారంలో ఉన్నతమైన స్థానం ఇచ్చింది సీఎం చంద్రబాబునాయుడు అని అన్నారు. ఆదరణ పథకంతో బీసీలను ఆదుకున్న విషయాన్ని గుర్తించాలని ఆయన ప్రస్తావించారు.

మానవత్వం మరిచి..

(ఐదో పేజీ తరువాయి)

రోజుల్లో ప్రసవించనుందని వైద్యులు చెప్పారు. దీంతో వారు ఎంతో ఆనందంతో.. ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం 11.50గంటలకు డేఅండ్ నైట్ జంక్షన్ సమీపంలో కొత్త వంతెన వద్ద వెనుక నుంచి ఒక ఆర్టీసీ బస్సు వారి వాహనాన్ని ఢీకొంది. దుర్గారావుపై స్కూటీ పడిపోయింది. రాజేశ్వరి రోడ్డుమీద పడిపోగా.. బస్సు వెనుక చక్రం ఆమె తొడపై భాగం నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆమె కాలు విరిగి తీవ్ర రక్తస్రావమైంది. ప్రమాదానికి కారణమైన బస్సు ఆపకుండా వెళ్లిపోయారు.

ఆటోడ్రైవర్ మానవత్వం..

తీవ్ర రక్తస్రావంలో ఉన్న భార్యను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు దుర్గారావు ఎన్ని వాహనాలను ఆపినా.. ఫలితం లేకపోయింది. ఎవరూ వాహనాలు ఆపలేదు. చివరికి ఒక ఆటోడ్రైవర్ ఆ గర్భిణీని మెడికవర్ ఆస్పత్రికి తీసుకెళ్లి చేర్పించారు. ఆమె చికిత్స పొందుతూ మధ్యాహ్నం 3.30 గంటలకు మృతి చెందింది. కనీసం బిడ్డను అయినా కాపాడేందుకు వైద్యులు ప్రయత్నించగా.. తీవ్ర రక్తస్రావం కావడంతో ఫలితం లేకపోయింది. తల్లీ,కడుపులో బిడ్డ ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు.

సీసీ కెమెరాల ఆధారంగా...

ఈ ఘటనపై దుర్గారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తర్వాత ఆస్పత్రికి వెళ్లి బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఆర్టీసీ బస్సు ఢీ కొట్టిందని తెలియడంతో ట్రాఫిక్ ఎస్ఐ మెట్ట సుధ, సీఐ నాగరాజు ఆర్టీసీ డిపోకు వెళ్లి డీఎంతో మాట్లాడారు. ఆ సమయంలో అటుగా వెళ్లిన బస్సుల వివరాలు సేకరించారు. బ్రిడ్జి వద్ద ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా ప్రమాదానికి కారణమైన బస్సును కనుగొన్నారు. ఆ బస్సు డ్రైవర్ నీలాపు హరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నాగరాజు తెలిపారు.

బుకాయించేందుకు యత్నం..

మృతురాలి భర్త దుర్గారావు సోమవారం రాత్రి 7.30గంటల సమయంలో ట్రాఫిక్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తుండగా ఆర్టీసీ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. బాధితులతో మాట్లాడుతున్న ఎస్ఐ సుధతో మంతనాలు చేసేందుకు యత్నించారు. దీంతో ఎస్ఐ సుధ వారిని హెచ్చరించారు. మానవత్వం మరిచి ఓ నిండు గర్భిని మీద నుంచి బస్సును ఎక్కించి ఆమెతో పాటు కడుపులో ఉన్న బిడ్డ చావుకు కారణమై.. ఇప్పుడు మంతనాలు చేస్తారా? అని వారిని మందలించారు. బస్సులో మహిళ కండక్టర్ ఉన్నా.. సాటి ఆడదాని కష్టం కనిపించలేదా అని ప్రశ్నించారు. మానవత్వం మరిచి బస్సుతో పరారై ఇంతవరకు స్టేషన్‌కు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆర్టీసీ ఉద్యోగులు అసలు ప్రమాదం మా బస్సు వల్లే జరిగిందని ఎలా చెబుతారంటూ ఎదురుతిరగడంతో పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు వాగ్వాదానికి దిగారు. దీంతో బస్సుడ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజేశ్వరి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనతో మృతురాలి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

ఐదు రోజుల వ్యవధిలోనే భార్య, భర్త మృతి


గణపతి, భారతి దంపతులు (ఫైల్)

సోంపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఐదు రోజులు వ్యవధిలోనే భార్య భర్తలిద్దరూ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లో వెళ్తే.. కొర్లాం మాజీ ఎంపీటీసీ తామాడ గణపతి (73) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. ఈయన భార్య తామాడ భారతి ఐదు రోజల కిందటే మృతిచెందారు. భార్యా, భర్తలిద్దరూ ఐదురోజుల వ్యవధిలోనే మృతిచెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గణపతి మృతిపై పలువురు సంతాపం తెలిపారు. కాగా గణపతి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీగా సేవలందించారు.

నీలంపేట సర్పంచ్..


శిమ్మమ్మ (ఫైల్)

బూర్జ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): నీలాదేవిపురం (నీలంపేట) సర్పంచ్ జల్లు శిమ్మమ్మ (59) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. గతంలో వైఎస్ఆర్ హయాంలో ఒకసారి ఈమె సర్పంచ్‌గా సేవలందించగా.. ప్రస్తుతం కూడా సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. వీరికుటుంబం మూడు పర్యాయాలు గ్రామానికి సర్పంచ్‌గా ప్రాతినిధ్యం వహించారు. పార్టీలకు అతీతంగా పలువురు ఈమె అంత్యక్రియలకు హాజరై, ఆమె కటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


ఈవోకు చెక్కు అందిస్తున్న గోవిందరావు

గార, మార్చి 10(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మంలో గల ప్రసిద్ధ కూర్మ క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కె.మత్స్యలేశం గ్రామానికి చెందిన పప్పు గోవిందరావు, జ్యోతి దంపతులు రూ.లక్ష విరాళం అందించారు. ఈ మేరకు సోమవారం ఉదయం స్వామివారిని దర్శించుకుని ఈవో జి.గురునాథరావుకు చెక్కు అందజేశారు. తమ కుమార్తె పప్పు సుశీల (సచివాలయం ఉమెన్ పీసీ) జ్ఞాపకార్థం అందించినట్టు వారు తెలిపారు.

10 రోజులైనా సరఫరాలేని గ్యాస్ సిలిండర్లు

● ఇబ్బందుల్లో వినియోగదారులు

పొందూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): డెలివరీ బిల్లు కంటే అదనపు వసూళ్లకు పాల్పడిన స్థానిక ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాకం, తీసుకున్న నిర్ణయాలు అమలుచేయడంలో అధికారుల జాప్యం వినియోగదారులకు శాపాలుగా మారాయి. అదనపు వసూళ్లపై కలెక్టర్ ఆదేశాలతో 10 రోజుల కిందట స్థానిక ఏజెన్సీకి నిర్వహణ బాధ్యతలు అధికారులు రద్దు చేసి వేరొక గ్యాస్ ఏజెన్సీకి అప్పగించింది. అయినా గ్యాస్ సరఫరా ప్రారంభం కాకపోవడంతో వినియోగదారులు ఇబ్బందిపడుతున్నారు. పరిసర గ్రామాల నుంచి గ్యాస్‌కోసం ఖాళీ సిలిండర్లతో వస్తున్నా గోదాం మూసి ఉండడంతో నిట్టూరుస్తూ వెనుదిరుగుతున్నారు. ఇదిలావుంటే పాత ఏజెన్సీ నిర్వాహకులు.. గ్యాస్ డెలివరీ సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చి గ్యాస్ సరఫరా జరగకుండా అడ్డుకుంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా చేస్తే విధిలేక అధికారులు గ్యాస్ ఏజెన్సీ బాధ్యతలు తమకే తిరిగి అప్పగిస్తారని దీనికోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఏది ఏమైనా గ్యాస్ సరఫరా లేకపోవడంతో వినియోగదారులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పీఈటీ, పీడీ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్‌గా రమణ


ఎంవీ రమణ

శ్రీకాకుళం స్పోర్ట్స్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పీఈటీ, పీడీ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్‌గా జిల్లా పీఈటీ సంఘం అధ్యక్షుడు ఎంవీ రమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం విజయవాడలో జరిగిన ఏపీ పీఈటీ సంఘం సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా రమణ పనిచేస్తున్నారు. ఈయన ఎంపికపై జిల్లా ఒలింపిక్ సంఘం సీఈవో పి.సుందరరావు, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, గ్రిగ్స్ సంఘం కార్యదర్శి కె.మాధవరావు తదితరులు అభినందించారు.

ధర్నా విజయవంతం చేయండి

అరసవల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకానికి పెరిగిన ధరలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలని కోరుతూ ఈ నెల 18న విజయవాడలో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక ఇందిరానగర్‌లో గల సీఐటీయూ కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లా కమిటీ సభ్యులు ఎన్.గీతాబాల, కౌసల్య, తులసమ్మ, లక్ష్మి, తులసి, ప్రవీణ, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమం పట్టదా?

శ్రీకాకుళం రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి పాడి రైతుల సంక్షేమం పట్టడం లేదని, ఆ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకి కనీసం పాడి వ్యవస్థపై అవగాహన లేనట్టు వ్యవహరిస్తున్నారని వైసీపీ నాయకులు, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు విమర్శించారు. పాత్రునివలసలో ఉన్న పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరులతో మాట్లాడారు. కూటమి నేతలకు చెందిన డెయిరీ ఫారాల సంక్షేమం కోసం మిగిలిన డెయిరీ ఫారాల సంస్థలకు ఉరి వేస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీలో పాడి రైతుల సంక్షేమం పై చర్చ పెట్టాలని, అలాంటప్పుడే కూటమి ఎమ్మెల్యేలే మంత్రి అచ్చెన్నను నిదీసి కడిగేస్తారన్నారు. రాష్ట్రమంతా కమిషన్లు, పలాసలో అల్లుడు ట్యాక్స్‌తో దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ నెల 12న పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

యువతపోరు పోస్టర్ ఆవిష్కరణ

సోంపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ నిర్వహించనున్న యువత పోరు పోస్టర్‌ను సోమవారం ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ నిమ్మన దాసు తదితరులు ఉన్నారు.

● ఆమదాలవలస: పట్టణంలోని జగనన్న ప్రజాసేవ కార్యాలయం వద్ద పార్టీ నాయకులతో కలిసి యువత పోరు పోస్టర్‌ను నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆవిష్కరించారు. ఈ నెల 12న కలెక్టరేట్ వద్ద విద్యార్థులతో కలిసి యువత పోరు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు.

నాణ్యత పాటించాలి

జి.సిగడాం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సీసీ రహదారుల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పీఆర్ డీఈ ఎస్.శ్రీరాములు అన్నారు. వాంగ్రడంగిలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. ఏఈ సత్యనారాయణ, సర్పంచ్ సాకేటి నాగరాజు, మాజీ సర్పంచ్ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

అర్జీల పరిష్కారంలో ఆలస్యం చేయొద్దు

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారంలో ఆలస్యం చేయొద్దని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో ఆయన జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 141 అర్జీలను స్వీకరించారు. క్షుణ్ణంగా పరిశీలించి, అర్జీదారులు సంతృప్తి చెందేలా, అర్జీలను పరిష్కరించాలని, కారణాలను వారికి తెలియజేయాలన్నారు. తమ గ్రామంలోని చెరువు ఆక్రమణలు తొలగించాలని కిల్లిపాలెం గ్రామస్థులు కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా, డీఆర్డీఏ పీడీ కిరణ్ కుమార్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

● కొత్తూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వంశధార నిర్వాసిత కాలనీ మెట్టూరు బిట్-2 సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ యర్లంకి ధర్మారావు ఆధ్వర్యంలో నిర్వాసితులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

● ఇచ్ఛాపురం: త్వరలో ప్రారంభం కానున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాయడానికి సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని మండపల్లి సర్పంచ్ పిట్ట శేషమ్మ కలెక్టర్‌ను కోరారు.

పేదరికం లేని సమాజమే ధ్యేయం

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజమే లక్ష్యంగా పీ-4 విధానం అమలు చేయనున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. సోమవారం స్థానిక జడ్పీ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర విజన్-47 డాక్యుమెంట్‌లోని పది సూత్రాల్లో మొదటి సూత్రమైన సంపూర్ణ పేదరిక నిర్మూలన లక్ష్యంగా కార్యాచరణను రూపొందించినట్టు తెలిపారు. ఉగాది నుంచి ఈ కార్యక్రమం అమలు కానుందన్నారు. ఈ కార్యక్రమంపై ప్రజల నుంచి సూచనలు, సలహాలను స్వీకరించడం జరుగుతుందని, దీనికి సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి లేదా సంబంధిత లింక్ ద్వారా ఈ నెల 25వ తేదీ లోగా తమ అభిప్రాయాలు/ సూచనలు తెలియజేయాలని కలెక్టర్ కోరారు. చక్కని సూచనలు తెలిపిన వారికి ప్రశంసా పత్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ మేరకు అధికారులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ పద్మావతి, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆదిత్యుని కల్యాణం


అరసవల్లి: అలంకరణలో స్వామివారు

అరసవల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారికి సోమవారం వైభవంగా కల్యాణం నిర్వహించారు. ఫల్గుణ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆలయ అనివెట్టి మండపంలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి ఉత్సవమూర్తులను పూలతో విశేషంగా అలంకరించారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ, దర్భముళ్ల శ్రీనివాసశర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉమాకామేశ్వరస్వామి ఆలయంలో..

సరుబుజ్జిలి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురంలో ఉమాకామేశ్వరస్వామి వారి కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు బంకుపల్లి భాస్కరరావు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, సహస్ర నామార్చనలు, రుద్రాభిషేకాలు, హోమం చేపట్టారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. వేద పండితులు గంగవరపు వాసుదేవశర్మ పాల్గొన్నారు.

వేడుకగా ఆలయాల ప్రారంభోత్సవం

కంచిలి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): బనవపుట్టుగ గ్రామంలో పాలపోలమ్మ, పాత పట్నాలమ్మ తల్లి అమ్మవార్ల ఆలయ ప్రారంభోత్సవం వేడుకగా నిర్వహించారు. సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మహిళలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

జి.సిగడాం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పెంట గ్రామంలో నూతన నిర్మించనున్న ఆలయానికి సోమవారం భూమి పూజ చేశారు. గ్రామ పురోహితులు భమిడిపాటి రంగబాబు వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ వైభవంగా నిర్వహించారు. గ్రామ సమీపంలో నారప్ప కోనేరు వద్ద నూతనంగా శివాలయం నిర్మాణం చేపట్టేందుకు గ్రామపెద్దలు నిర్ణయించినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ నిర్మాణానికి మీసాల పెద సూరిబాబు, రమణమ్మ దంపతులు స్థలాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, భక్తులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం


శ్రీముఖలింగేశ్వరుని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు

జలుమూరు/పాతపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో శ్రీముఖలింగేశ్వర స్వామికి సోమవారం గ్రామోత్సవం నిర్వహించారు. ఫాల్గుణ శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం ప్రత్యేక పల్లకిలో ఆసీనులను చేసి మంగళవాయిద్యాల నడుమ తిరువీధి నిర్వహించారు. ఆలయ ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం, సింహాచలం, శ్రీకృష్ణ, శివ, అచ్యుత, అప్పారావు పాల్గొన్నారు.

దర్శించుకున్న ఎమ్మెల్సీ గాదె

శ్రీముఖలింగేశ్వరస్వామిని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దానేటి కేశవరావు, జిల్లా ఉపాధ్యక్షుడు చల్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. అలాగే స్థానిక పాతపట్నం నీలమణి దుర్గమ్మను ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు సోమవారం రాత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కేశవరావు పూర్వ అధ్యక్షుడు వి.హరిశ్చంద్రుడు, పాతపట్నం శాఖ గౌరవాధ్యక్షుడు రేగేటి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిరావాలి

ఇచ్ఛాపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల కల్పన డిమాండ్ చేస్తూ ఈనెల 11న విజయవాడ ధర్నా చౌక్ వద్ద రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరగనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా యూత్ అధ్యక్షుడు పూడి కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం ఇచ్ఛాపురంలో ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చి ఉద్యోగ అవకాశాల కల్పన దిశగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయభాను, రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు, రాష్ట్ర ఇన్‌చార్జి మమతా నాగిరెడ్డి పాల్గొంటారని తెలిపారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో యువత పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

అర్హులందరికీ రుణాలు

ఇచ్ఛాపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): అర్హులైన మహిళా సంఘాలకు స్త్రీనిధి రుణాలు అందిస్తామని ఏజీఎం సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల మహిళా సమైక్య కార్యాలయంలో స్వయంశక్తి సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వయం శక్తి సంఘాల సభ్యులకు రుణాలు ఇచ్చే ముందు సభ్యులతో మాట్లాడతామన్నారు. గ్రామ సంఘాల్లో 100శాతం రికవరీ ఉన్నా.. ఇప్పటికీ బాలరాంపురం, తులసిగాం గ్రామ సంఘాల్లో మాత్రమే బకాయిలు ఉన్నాయన్నారు. స్త్రీ నిధి ఏజీఎం కె.సత్యనారాయణ, ఏపీఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై జాప్యం చేయొద్దు: ఎస్పీ


సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన దరఖాస్తులపై అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి జిల్లా పోలీసు అధికారులకు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(మీకోసం) కార్యాక్రమంలో 52 మంది నుంచి వినతులను ఎస్పీ స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై పారదర్శకంగా విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు.

వేతనాలు పెంచాలి


వీసీకి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలో కాంట్రాక్ట్ టీచింగ్ ఫ్యాకల్టీ నోటిఫికేషన్ (2018) ద్వారా ఎంపికైన తమకు కాంట్రాక్ట్ అధ్యాపకులుగా గుర్తించి, వేతనాలు పెంచాలని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలు కోరారు. ఈ మేరకు వీసీ ఎం.విజయకుమార్‌ను కలిసి వినతి పత్రం అందించారు. శ్రీకాకుళం క్యాంపస్‌లో జరిగిన టెక్‌ఫెస్ట్‌కు హాజరైన వీసీని కలిసి తమ సమస్యలను వివరించారు. అన్ని అర్హతలు ఉన్న తమకు నెలకు కేవలం రూ.25 వేలు చెల్లిస్తున్నారన్నారు. జీవో ప్రకారం రూ.39 వేలు చెల్లించాలని కోరారు. రెడ్డి లక్ష్మణనాయుడు, పి.నవీన్, వై.నారాయణరావు తదితరులు ఉన్నారు.

తప్పుడు కేసులు బనాయించడం సరికాదు



గుజరాతీపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయిచోటిలో ఇటీవల వీరభద్రస్వామి ఆలయ పర్వేటి ఉత్సవం సందర్భంగా భక్తు లు ఊరేగింపు చేస్తుండగా ముస్లింలు దాడిచేయగా, స్థానిక ఎస్ఐ హిందువులపై తప్పుడు కేసులు బనాయించడం సరికాదని బీజేపీ నేతలు ఖండించారు. స్థానిక కలెక్టరేట్ సమీపాన డచ్ భవనం వద్ద సోమవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతి పపత్రం అందించారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు

ఆమదాలవలస, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలో బీటీ, సీసీ రహదారులు, కాలువలు నిర్మాణానికి రూ.3.69 కోట్లు కూటమి ప్రభుత్వం మంజూరు చేసినట్టు టీడీపీ కార్యాలయ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకంలో మంజూరైన ఈ నిధులతో మూడు తారు రోడ్లకు రూ.2.66 కోట్లు, ఎనిమిది సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి రూ.1.3 కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, పంచాయతీ రాజ్‌శాఖా మంత్రి పవన్‌కల్యాణ్, రోడ్లు భవనాలశాఖా మంత్రి జనార్దన్ రెడ్డికి ఎమ్మెల్యే కూన రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

● పొందూరు: మండలంలో ఆరు రహదారుల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం రూ.10.60 కోట్లు మంజూరు చేసినట్టు పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. ఎన్నో ఏళ్లుగా నిర్మాణానికి నోచుకోని రోడ్లను బీటీ రహదారులుగా నిర్మాణానికి ఉపాధి నిధులు విడుదలైనట్టు రవికుమార్ తెలిపారు. వీఆర్ గూడెం, లోలుగు గ్రామాల మధ్య రహదారికి రెండు విభాగాలుగా రూ.3.90 కోట్లు, రెడ్డిపేట మీదుగా అదపాక, గుర్రాలపాలెం రోడ్డుకు రెండు విభాగాలుగా రూ.3.80 కోట్లు, మలకాం మదుపాం రోడ్డుకు రూ.1.70 కోట్లు, లత్సయ్యపేట, కావలి రోడ్డుకు రూ.1.20 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు.

సారా నియంత్రణకు యువత ముందుకురావాలి

కంచిలి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సారా నియంత్రణకు యువత, మహిళలు నడుం కట్టాలని ఎక్సైజ్ సీఐ కె.బేబీ పిలుపునిచ్చారు. జలంత్రకోట, ఎంఎస్ పల్లి గ్రామాల్లో సోమవారం నవోదయం-2.0 కార్యక్రమంలో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారసారా తాగడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎక్సైజ్, పంచాయతీ, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంపై శిక్షణ

అరసవల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి) అయోడిన్ లోపంపై ఆశ కార్యకర్తలకు స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ (ఢిల్లీ) ప్రతినిధులు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జిల్లాలో ఐదు మండలాల్లో 40 గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని స్మార్ట్ ఇండియా ప్రోగ్రాం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో, ఆశ కార్యకర్తల నోడల్ అధికారి రవి, డీహెచ్‌ఈ, సిబ్బంది హాజరయ్యారు.

ఎమ్మెల్సీ దువ్వాడపై ఫిర్యాదు

పొందూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): టెక్కలికి చెందిన వైసీపీ నేత, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై మండల జనసేన పార్టీ నాయకులు సోమవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై దువ్వాడ శ్రీనివాస్ చేసిన అనుచిత వాఖ్యతలపై చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు పొన్నాడ బాలకృష్ణ, నాయకులు కొంచాడ చిన్నంనాయుడు, గార బాబూరావు, పైడి రాంబాబు తదితరులు ఉన్నారు.

అప్రంటీస్‌తో ఉపాధి అవకాశాలు

ఎచ్చెర్ల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఐటీఐ విద్యార్థులు అప్రంటీస్ చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ఇనిస్టిట్యూట్ మేనేజ్‌మెంటు చైర్మన్ ఎంవీఆర్ మూర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐలో సోమవారం జాతీయ అప్రంటీస్ మేళా జరిగింది. 143 మంది అభ్యర్థులు హాజరుకాగా, వీరిలో 35 మంది వివిధ కంపెనీల్లో అప్రంటీస్‌కు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు, ఐటీఐ ట్రైనింగ్ ఆఫీసర్ కామేశ్వరరావు, వివిధ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు పరిశీలన

శ్రీకాకుళం రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కిల్లిపాలెం గ్రామంలో జరుగుతున్న ఈ పంట నమోదు కార్యక్రమాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం పరిశీలించారు. సర్వే నెంబరు 106లో ఉన్న మొక్కజొన్న తోటను పరిశీలించి రైతులు కళ్లేపల్లి సోమనాథరావు, కల్యాణి, ఉమామహేశ్వరరావు రైతులతో మాట్లాడారు. ఈ పంట నమోదు గ్రామ వ్యవసాయ సహాయ సంచాలకులు బగ్గు రజనీ నిర్వహించారు. దీనిపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏవో ఉషారాణి, ఏఈవో ఎరుకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

15న సర్వసభ్య సమావేశం

కంచిలి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి దేవదాస్ రెడ్డి అధ్యక్షతన మార్చి 15వ తేదీ శనివారం నిర్వహించనున్నట్లు ఎంపిడివో వి.తిరుమలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత శాఖాధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

ఎమ్మెల్సీ పరామర్శ

బూర్జ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మదనాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు గోవిందరావు అత్త ఇటీవల కన్నుమూశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం గోవిందరావును పరామర్శించారు.

బడిలో చేర్పించాలి

రణస్థలం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలను బడిలోనే చేర్పించేలా చర్యలు తీసుకోవాలని డీఈవో ఎస్.తిరుమలచైతన్య ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంఈవో కార్యాలయాన్ని సందర్శించి ఉపాధ్యాయులతో సమీక్షించారు. ఎంఈవో త్రినాథరావు తదితరులు ఉన్నారు.

జయప్రదం చేయండి

అరసవల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 11 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రజా చైతన్య యాత్రలను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బి.తులసీదాస్ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కె.మోహనరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, నాయకులు బి.కృష్ణమూర్తి, పి.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సారా తయారు చేస్తే పీడీ చట్టం అమలు

మెళియాపుట్టి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సారా తయారు చేసినా, తయారీకి సహకరించిన వారిపై పీడీ చట్టం అమలు చేస్తామని ఎక్సైజ్ శాఖ డీసీ శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. సోమ వారం మామిడిగుడ్డి గ్రామంలో 'నవోదయం 2.0' కార్యక్రమం నిర్వహించారు. సారాను నిర్మూలించి భవిష్యత్ తరాలకు బాటలు వేయాలన్నారు. దీనిపై అవగాహనకు ఈ కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. సారా వల్ల అనారోగ్యం పాలై కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతా యన్నారు. కార్యక్రమంలో జిల్లా స్పెషల్‌ఫోర్స్ మెంబర్ సూపరింటెండెంట్ తిరుపతినాయుడు, టెక్కలి సీఐలు మేరాసాహెబ్, గాయత్రి, మెళియాపుట్టి ఎస్ఐ రమేష్‌బాబు, తహసీల్దార్ బి.పాపారావు, ఎంపీడీవో ప్రసాద్‌పండా తదితరులు పాల్గొన్నారు.

‘జల్‌జీవన్’పై నీలినీడలు

- నత్తనడకన పనులు
- దాహార్తితో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

హిరమండలం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి తాగునీరందించాలన్న ఆశయంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ‘జల్ జీవన్’ మిషన్ పనులు క్షేత్రస్థాయిలో పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2020లో ఈ పథకాన్ని అమలు చేయగా అప్పటి వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర వాటాగా చెల్లించాల్సిన మొత్తం ఇవ్వకపోవడంతో పనులు అర్ధంతరంగా నిలిచి పోయాయి. ప్రతి ఇంటికి కొళాయి ఏర్పాటు ద్వారా స్వచ్ఛమైన తాగునీరందించడం లక్ష్యం. సగటు వ్యక్తికి రోజుకు 40 లీటర్ల నీరిచ్చేలా అప్పటిలో రూపొందించగా ఆ తరువాత దానిని 50 లీటర్లకు పెంచేలా జల్‌జీవన్ పథకం ప్రణాళికలు తయారు చేశారు. జిల్లాలోని 28 మండలాల్లో రెండు దశల్లో కలిపి 4,823 పనులు మంజూరయ్యాయి. ఒక్కో మండలానికి రూ.10 కోట్లకు తగ్గకుండా పనులు ప్రతిపాదించారు. పైపులైన్లు, ట్యాంకుల నిర్మాణం, కొళాయిల ఏర్పాటు తదితర పనులు చేపట్టాల్సి ఉంది. దీనికోసం రూ.1,502.36 కోట్లు కేటాయించారు. 2024 నాటికి పూర్తి చేయాలని అప్పటిలో గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు ప్రణాళికలు రూపొందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం చొప్పున నిధులు కేటాయించాల్సి ఉంది. మంజూరైన పనుల్లో 2,625 ప్రారంభం కాగా 970 మాత్రమే పూర్తయ్యాయి. మొదట్లో పనులు వేగంగా జరిగినా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరిగింది. కేంద్రం నిధులిచ్చినా రాష్ట్రం తన వాటా ఇవ్వకపోవడంతో పనులు నెమ్మదించాయి. కొన్ని చోట్ల ట్యాంకుల నిర్మాణానికే నిధులు సరిపోకపోవడంతో అప్పటిలో ఉన్న నీటి పథకాల నుంచి పైప్‌లు వేసి కొళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు నిర్ణయించారు. అయినా బిల్లులు రాకపోవడంతో చాలా చోట్ల పనులు నిలిపివేశారు. కొన్ని చోట్ల పనులే ప్రారంభం కాలేదు. దీంతో లక్ష్యానికి తూట్లు పడ్డాయి. ఎక్కడ చూసినా అర్ధంతరంగా మిగిలిన పనులే దర్శనమిస్తున్నాయి.



పింద్రువాడ కాలనీలో రోడ్డుకు అడ్డంగా ఉండడంతో చెట్టుకు కట్టిన పైపులైను

కూటమి ప్రభుత్వంలో వివరాల సేకరణ

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మూడు నెలల కిందట జిల్లా వ్యాప్తంగా సర్వే నిర్వహించింది. ఏ మేర పనులు పూర్తయ్యాయి, ఇంకా ఎక్కడెక్కడ పూర్తి కావాల్సి ఉన్నదీ వివరాలు సేకరించారు. జీవో 918 ద్వారా జిల్లాలో ఇప్పటివరకు ప్రారంభించని 214 పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. అవసరాలకు అనుగుణంగా మళ్లీ డీపీఆర్‌లు సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశించింది. అలాగే ప్రస్తుతం నత్తనడకన సాగుతున్న పనులను ఈ ఏడాది జూన్‌లోగా పూర్తి చేయాలని ప్రభుత్వ గడువు విధించింది. అయితే వేసవి తీవ్రత అప్పుడే కనిపిస్తుండడంతో ప్రజలు దాహార్తితో అల్లాడుతున్నారు. గడువులోగా పనులు పూర్తవుతాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కొళాయిలకు హెడ్‌లు లేక లీకేజీ



వజ్రపుకొత్తూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జల్‌జీవన్ మిషన్ లో ఏర్పాటు చేసిన కొళాయిలకు హెడ్‌లు లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. రాజాం కాలనీ వద్ద కొళాయిలకు హెడ్‌లు లేకపో వడంతో స్థానికులు కర్రలను కొళాయి గొట్టాల్లో పెట్టినప్పటికీ ప్రయోజనం కనిపించ డం లేదు. నీరు లీకవుతుండడంతో ఆ ప్రాంతమంతా బురదగా తయారవుతోంది. పైప్ లైన్లు కూడా నాణ్యమైనవి కావని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నిధులు వస్తే పనులు పూర్తి చేస్తాం



జిల్లాలో గత ప్రభుత్వంలో అసంపూర్తిగా ఉన్న పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. వాటికి సంబంధించిన నిధులు వెనక్కి మళ్లాయి. ప్రభుత్వం అనుమతులు వచ్చిన వెంటనే పనులు పూర్తి చేస్తాం.

ఇషాన్ బాషా, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్

క్రైం కార్నర్ — ఆర్థిక ఇబ్బందులతో స్మగ్లర్లుగా..

- ముగ్గురు ఒడిశా వాసుల అరెస్ట్
- ఏడు కిలోల గంజాయి స్వాధీనం
- డీఎస్పీ వెంకట అప్పారావు




మాట్లాడుతున్న కాశీబుగ్గ డీఎస్పీ వెంకటఅప్పారావు

పలాస, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులను తొలగించుకునేందుకు గంజాయి స్మగ్లర్లుగా మారిన ముగ్గురు ఒడిశా వాసులు కాశీబుగ్గ పోలీసులకు పట్టుబడ్డారు. ఈ మేరకు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఆ వివరాలు వెల్లడించారు. ఈ మేరకు.. ఒడిశా రాష్ట్రం హరుపదర్ గ్రామానికి చెందిన బినియా మనిమజి, ఆయన సోదరుడు అయుబామజి, దిపిరుగుడా గ్రామానికి చెందిన మైఖేల్ బద్రాయిత 7.700 కిలోల గంజాయి తీసుకొని పలాస రైల్వే స్టేషన్‌కు వస్తుండగా ఇందిరాచౌక్ వద్ద సీఐ బి.సూర్యనారాయణ తనిఖీ నిర్వహిస్తుండగా ఈ ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారి బ్యాగులు తనిఖీ చేయగా గంజాయి బయట పడింది. వెంటనే వారిని అరెస్టు చేసి బైక్, రూ.3900 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు దిపిరిగుడా గ్రామా నికి చెందిన జాన్ వద్ద గంజాయి కొనుగోలు చేసి విజయ్ అనే వ్యక్తికి పలాస రైల్వే స్టేషన్ వద్ద గంజాయి అప్పగించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. వీరి ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన జాన్ గంజాయి రవాణా చేస్తే కిలోకు రూ.1000 నగదు ఇస్తానని చెప్పడంతో అంగీకరించి రవాణా చేస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. ఈ వ్యవహారంలో ఐదుగురిపై కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. మిగిలిన జాన్, విజయ్‌ల కోసం వెతుకు తున్నామన్నారు. గంజాయి స్మగ్లర్లను పట్టుకున్న పోలీసు సిబ్బందిని అభినందించారు. సమావేశంలో సీఐ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వృద్ధుడి మృతి

పాతపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సీతారాంపల్లి గ్రామానికి చెందిన రంగాల ఆదినారాయణ (88) శ్రీకా కుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి. ఆదినారాయణ దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపానికి గురై ఆదివారం గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి చేరాడు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక సీహెచ్‌సీకి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సిఫారసు మేరకు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహానికి సీహెచ్‌సీలో సోమవారం పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. మృతుడి కుమారుడు కృష్ణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.లావణ్య తెలిపారు.

పాత పోలీసు స్టేషన్ ఆవరణలో అగ్ని ప్రమాదం



పాత పోలీసుస్టేషన్ ఆవరణలో చెలరేగిన అగ్ని

నరసన్నపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న పాత పోలీసుస్టేషన్ ఆవరణలో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తి సిగరెట్ ముక్క వేయడంతో ఈ ప్రమాదం జరగడంతో ఆవరణలో ఉన్న చెత్త, చెట్ల కొమ్మలకు నిప్పంటుకుంది. దీంతో ఆవరణలోని రెండు ప్రమాదాల్లో పట్టుబడిన వాహన సామగ్రి అగ్నికి ఆహుతైంది. వెంటనే హెచ్‌సీ దాలినాయుడు, పీసీ సింహాచలం స్పందించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వెంటనే వారు వాహనంతో వచ్చి మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదం జరిగిన సమీపంలోనే సీఐ, తహసీల్దార్ కార్యాలయాలున్నాయి.

పెయింటర్‌కు తీవ్ర గాయాలు

టెక్కలి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక కంచ్ర వీధికి చెందిన గయా గిరి అయ్యప్పనగర్‌లో సోమవారం ఓ ఇంటికి పెయింటింగ్ వేస్తూ ప్రమాదవశాత్తు రెండో అంతస్తు నుంచి జారిపడడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన కన్నారావు

హిరమండలం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పొందూ రు గ్రామానికి చెందిన గొర్లె కన్నారావు సోమ వారం మండలంలోని ధనుపురం గ్రామంలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఎండీ యాసిన్ తెలిపిన వివరాలిలా ఉన్నా యి.. ఎరుకుల కులానికి చెందిన కన్నారావు తన భార్యతో కలిసి మూడు రోజుల కిందట భార్య, అత్తమామలతో కలిసి ధనుపురం సమీపంలోని ధాబా పక్కన బస చేసి చుట్టుపక్కల గాడిద పాలు అమ్మాడు. కొన్ని రోజులుగా భార్య భర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. రెండు రోజుల కిందట భార్య నాగలక్ష్మి తన చెల్లికి ఆరోగ్యం బాగు లేదని కవిటి గ్రామానికి వెళ్లింది. ఆది వారం వస్తానని చెప్పిన భార్య రాక పోయే సరికి మనస్తాపానికి గురై కన్నా రావు అదే రోజు బస చేసిన ప్రదేశం లోని పొలాల్లో చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు పాప, బాబు ఉన్నారు. మృతుడి తల్లి సీతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్ఐ చెప్పారు.

రామకృష్ణాపురంలో జీడితోటల దగ్ధం



జీడి తోటల్లో ఎగసిపడుతున్న అగ్ని జ్వాలలు

జలుమూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అంధవరం పంచాయతీ రామకృష్ణాపురంలో వంశధారనదీ తీరంలో సోమవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో 100 ఎకరాలు పైబడి జీడి తోటలు దగ్ధమైనట్లు గ్రామస్థులు తెలిపారు. ఒక్కసారిగా అగ్నిజ్వాలలు ఎగిసిపడి జీడితోటలు అగ్నికి ఆహుతయ్యాయన్నారు. నదిలో నీరు అందుబాటులో ఉండడంతో గ్రామస్థులు మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఏ రైతుకి ఎంత మేర నష్టం వాటిల్లిందో తెలియాల్సి ఉంది. అగ్నిప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. జీడితోటలు అగ్నికి ఆహుతి అవడంతో ఈ ఏడాది జీడి మామిడి పంటలు నష్టపోయామని రైతులు వాపోతున్నారు.

వేతనం పెంపుపై సీఎం ప్రకటన చేయాలి

- కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల వేతనం పెంచడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో ప్రకటన చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కల్యాణి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యద ర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనకుండా ప్రభుత్వం నిర్బంధించడంపై నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళా దినోత్సవం రోజున రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను ఇచ్చి ఆడపడుచులను మోసం చేసిందని విమర్శించారు. శాంతియుతంగా చలో విజయవాడ కార్యక్రమం చేపడితే రాష్ట్ర వ్యాప్తంగా గృహ నిర్బంధాలు, అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.సుజాత, కె.హేమలత, కె.లక్ష్మి, మాధవి, చంద్రమౌళి, భూలక్ష్మి, టి.రాజేశ్వరి, రామాదేవి, అప్పమ్మ, లలిత, అప్పలసరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

టెక్కలి/పలాస రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పనిభారం తగ్గించి రాజకీయ వేధింపులను విడనాడాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక టెక్కలి సబ్ కలెక్టర్, పలాస ఆర్డీవో కార్యాలయాల ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నేతలు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, యాప్‌ల భారం తొలగించాలని, గ్రాట్యూటీ, పెండింగ్ బిల్లులు చెల్లించాలని నినాదాలు చేశారు. టెక్కలి కార్యాలయంలోకి ఆందోళనకారులు వెళ్లకుండా సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. అనంతరం సంఘ నాయకులు చింతాడ ఇందిర, బి.రమణమ్మ, శ్రీదేవి, పద్మ తదితరులు ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం ఇచ్చారు. పలాసలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, అంగన్‌వాడీ యూని యన్ జిల్లా నాయకులు ఎన్.హైమావతి, సునీత, ఎం.మంజుల కుమారి తదితరులు ఆర్డీవో వెంకటేష్‌కు వినతిపత్రం అందించారు.



టెక్కలి: ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

- ఇచ్ఛాపురం: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి ఆ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిరసనలు తెలిపారు. అనంతరం తహసీల్దార్ ఎన్.వెంకటరావు, డీటీ శ్రీహరికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు హైమావతి, బాలామణి, జయ, ఉమ, నరసమ్మ, నాగలక్ష్మి, విజయ, సుహాసిని, పుణ్య, ద్రాక్ష తదితరులు పాల్గొన్నారు.



పలాస: ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



ఇచ్ఛాపురం: తహసీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న దృశ్యం

న్యూస్ బాక్స్

సత్యసాయి మందిర కన్వీనర్‌గా తిరుమల

పలాస, మార్చి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి మందిర కన్వీనర్‌గా పలాసకు చెందిన జీడి వ్యాపారవేత్త ఇప్పిలి తిరుమల ఎంపికయ్యారు. రెండేళ్ల పాటు వివిధ కార్యక్రమాలు చేప ట్టేందుకు కృషి చేస్తారు. తిరుమల ఎంపికపై సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, పలాస ప్రతినిధులు బైరిగి, మల్లా రామేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు.

పనిభారం తగ్గించాలని వినతి

సంతబొమ్మాళి,మార్చి10(ఆంధ్రజ్యోతి): పనిభారం తగ్గించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులు సోమవారం టెక్కలి డీఎల్పీవో ఆర్.గోపిబాలను కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందించారు. వినతి పత్రం అందజేసిన వారిలో మండల పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షుడు దుంప శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఉమాపతి, కార్యదర్శులు పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యతకు అడవులు దోహదం

హిరమండలం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పర్యావరణ సమతుల్యతకు అడవులు దోహదపడతాయని సారవకోట ఫారెస్ట్ రేంజర్ ఎల్.ఈశ్వరరావు అన్నారు. సోమవారం అవలంగి ఉన్నత పాఠశాల విద్యార్థులకు అటవీ వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కలిగించారు. కొరడా బీట్ అటవీ ప్రాంతంలోకి విద్యార్థులను తీసుకువెళ్లి ప్రకృతి శిబిరం నిర్వహించారు.

మార్గదర్శకురాలు సావిత్రీబాయి పూలే

పాతపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే మార్గదర్శకురాలని సీఐ వి.రామారావు అన్నారు. సావిత్రీబాయి పూలే సందర్భంగా ఎంఆర్‌సీ ఆవరణలోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.చంద్రకుమారి, ఎస్ఐ బి.లావణ్య, ఏఎల్‌వో శైలేష్‌కుమార్, పి. రామరాజు, ఎంఈవో సీహెచ్ తిరుమలరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి డోలోత్సవాలు

కోటబొమ్మాళి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి గ్రామంలోని రాధా కాంత స్వామి ఆలయంలో బుధవారం నుంచి 14వ తేదీ వరకు డోలోత్స వాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మూడు రోజులు స్వామికి విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

మాకివలస భూములపై వాస్తవాలు చెప్పండి: ఆర్డీవో



వివరాలు సేకరిస్తున్న ఆర్డీవో సాయి ప్రత్యూష

జలుమూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మర్రివలస పంచాయతీ మాకివలస గిరిజన గ్రామానికి చెందిన భూములపై వాస్తవాలు చెప్పాలని శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయి ప్రత్యూష కోరా రు. జమ్మినివలస, బైదలాపురం గ్రామాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించి ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఎస్టీ మాకివలసకు చెందిన భూములు ఎవరివి, ఎవరి అధీనంలో ఉన్నాయి, ప్రస్తుతం ఎవరు సా గుచేస్తున్నారన్న అంశాలపై అభిప్రాయ సేకరణ చేపట్టారు. నివేదికను కలెక్టర్‌కు అందజే యనున్నట్లు ఆమె తెలి పారు. కార్యక్రమంలో తహసీల్దార్ జన్ని రామారావు, ఆర్ఐ కిరణ్‌కుమార్, మండల సర్వేయరు తర్ర నాగేశ్వరరావు, వీఆర్వో డి.గోపి పాల్గొన్నారు.

‘పోరుబాట’ను విజయవంతం చేయాలి



పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నేరవేర్చడంతో విఫమైందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ఉద్యోగకల్పన మాటను మరిచారని, దీనికి నిరసనగా బుధవారం నిర్వహించ నున్న యువత పోరుబాటను జయ ప్రదం చేయాలని కోరారు. నాయకులు ధర్మాన కృష్ణచైతన్య, ఆరంగి మురళి, కోరాడ చంద్రభూషణ గుప్త తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కొడుకును వదిలేసిన తండ్రి

- పోలీసు సాయంతో తల్లి చెంతకు..



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న సీఐ

శ్రీకాకుళం క్రైం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై తాగిన మత్తులో కన్న కొడుకుని మద్యం షాపు వద్ద తండ్రి వదిలేసిన ఘటన నగర వాసులను కలిచివేసింది. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక వాంబే కాలనీలో నివాసం ఉంటున్న రుద్రగట్ల కనక రామారావు రోజు కూలీగా పని చేస్తూ.. భార్య పిల్లలతో జీవిస్తుంటాడు. సోమవారం తన ఆరేళ్ల కొడుకుతో డే అండ్ కూడలిలో ఉన్న ఓ మద్యం దుకాణానికి వెళ్లి పూటుగా తాగాడు. ఈ క్రమంలో కొడుకు దేవీప్రసాద్‌ను మత్తులో అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. దీంతో తండ్రి కనిపించకపోవడంతో ఆ బిడ్డ ఏడవడంతో స్థానికులు ఆ బాలుడ్ని టూటౌన్ పోలీసులకు అప్పగించారు. సీఐ పి.ఈశ్వరరావు స్పందించి బాలుడికి సపర్యలు చేసి అన్ని సచివాలయాల గ్రూపుల్లో పోస్టు పెట్టారు. బాలుడి తల్లిదండ్రుల ఆచూకీ లభించడంతో తల్లి బమ్మిడి రూపకి బిడ్డను సీఐ ఈశ్వరరావు అప్పగించారు.

ధాన్యం కొనుగోలు చేయండి

టెక్కలి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): తాను ఖరీఫ్ సీజన్‌లో పండించిన ధాన్యం 80 బస్తాలు వరకు ఉన్నాయని, వీటిని కొనుగోలు చేయాలని నంబాళ్లపేటకు చెందిన నంబాళ్ల అప్పలస్వామి కోరారు. ఈ మేరకు సోమవారం ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందించారు. కొత్తూరు మండలం నాయుడు చెరువును కొత్తూరుకు చెందిన వ్యాపారవేత్తలు గుడ్ల పాండురంగారావు, కృష్ణారావు ఆక్రమించు కున్నారని సుంకర కోటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. అలాగే వ్యక్తిగత సమస్యలపై పలువురు వినతిపత్రాలు అందించారు.

గ్రామాల్లో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

జిల్లాలో వివిధ గ్రామాల్లో సోమవారం ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఆలయ వార్షికోత్సవాలు, విగ్రహ ప్రతిష్ఠలు ఘనంగా నిర్వహించారు. వివిధ కార్యక్రమాలు చేపట్టారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం చేస్తున్న వేద పండితులు

ఎల్.ఎన్.పేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): చిన్నకొల్లివలస ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో కోదండరామాలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా సోమవారం సీతారాము కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. పురోహితులు భాస్కరభట్ల వరప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సుప్రభాతసేవ, నిత్యార్చనలు, విశేష హోమాలు, యంత్ర ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

ఘనంగా కోదండరామాలయ వార్షికోత్సవం

పోలాకి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): అంపలాం సమీపంలోని వేంకటేశ్వరస్వామి మహాలక్ష్మి సహిత కోదండ రామాలయ ప్రథమ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు చామర్తి సత్యసాయి కృష్ణమాచార్యులు, రేజేటి సాకేత రామాచార్యులు, తేజోమూర్తుల వెంకట రమణమూర్తి ఆధ్వర్యంలో ఉదయం నుంచి పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ, వాస్తు మండపారాధనలు, హోమం అనంతరం స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు కరణం రామారావు దంపతులు, అర్చకుడు వెంకటరమణమూర్తి, గ్రామస్థులు పాల్గొన్నారు.

డోలోత్సవాల్లో స్వామికి ప్రత్యేక పూజలు



స్వామిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి శివాజీ

హరిపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రట్టి వల్లభ నారాయణస్వామి డోలోత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రట్టి సీతారాం, ప్రహ్లాద్, త్రినాథ్ ఆధ్వర్యంలో స్వామిని పల్లకిలో వేంచేపు చేసి తిరువీధి ఉత్సవం చేపట్టారు. స్వామివారు పాలకాండంతో కూడిన గొడుగుతో తిరువీధిలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామిని మాజీ మంత్రి గౌతు శ్యామ సుందర శివాజీ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భావన దుర్యోధన, దాసరి తాతారావు, బమ్మిడి కర్రయ్య, పుల్లా వాసుదేవ, బైరిశెట్టి గున్నయ్య, లబ్బ రుద్రయ్య పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శిఖరాభిషేకానికి కలశాలతో నీటిని తీసుకువెళుతున్న మహిళలు

నందిగాం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నందిగాంలో కొలువై ఉన్న ఉమా అగస్త్యేశ్వరస్వామి ఆలయ ఏడో వార్షికో త్సవం సోమ వారం ఘనంగా జరిగింది. గ్రామ పురోహితులు రేజేటి బోసు బాబు, ఎం.రమేష్‌శర్మ ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. మహిళలు కలశాలతో శిఖరాభిషేకం చేశారు. రుద్రాభిషేకాలు, రుద్ర యాగం, పూర్ణాహుతి, అష్టోత్తర కలశపూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

నౌగాంలో రుద్రయాగం

నౌగాంలోని గౌరీశంకరస్వామి ఆలయ పునః ప్రారంభం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు భక్తులతో రుద్ర యాగం చేయించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. భజన కార్యక్రమం నిర్వహించారు.

శ్రీలక్ష్మీ పేరంటాలమ్మకు చల్లదనం

జలుమూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అబ్బాయిపేటలో శ్రీలక్ష్మీ పేరంటాలుకు సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కలశాలతో మంగళ వాయిద్యాలతో అమ్మవారి సన్నిధికి చేరుకొని ముర్రాటలు సమర్పించి చల్లదనం చేశారు. కార్యక్రమంలో అబ్బాయిపేటతో పాటు పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.